క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ టి. విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ ఫీడర్ పరిధిలో రోజరీ స్కూల్, హెచ్‌ఐజీ 115 ఎదురుగా, షటిల్ పార్కు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌ఐజీ 1 నుంచి 29, ఫ్లాట్ నెంబర్ 24, 25, విక్టరీ కళాశాల హెచ్‌ఐజీ 90, ఫ్లాట్ నెంబర్ 6/బీ, ఫ్లాట్ నెంబర్ 154,155, హెచ్‌ఐజీ 159, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, డిమార్టు రోడ్డు, గౌతమి మోడల్ స్కూల్, హెచ్‌ఐజీ 29 ప్రాంతాలు, అదే విధంగా రోడ్డు నెంబర్ 5లోని 33/11 కె.వి. సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఎంఐజీ–295, సుబ్బయ్య హోటల్, ఎంఐజీ–407, మమతా హాస్పటల్, హెచ్‌ఐజీ 130, 151 ప్రాంతాలు, మధుసూదన్ హాస్పటల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

నూతన సంవత్సర కేలెండర్ ఆవిష్కరణ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అగ్నికుల క్షత్రియ నూతన సంవత్సర కేలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్ని కులాలను, మతాలను సమ ప్రాధాన్యంగా చూస్తున్నారని, అన్ని ప్రాంతాల వారు అన్నదమ్ముల్లాగా ఉంటున్నామని అన్నారు. అగ్నికుల క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.

జావెద్ అలీకి పలువురి జన్మదిన శుభాకాంక్షలు



మోతీనగర్: ఏ రాజకీయ నాయకుడైనా, ఏ ప్రజా ప్రతినిధైనా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె. జావెద్ అలీ పేర్కొన్నారు. సోమవారం మోతీనగర్‌లో ఎస్‌కె. జావెద్ ఆలీ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు పలు రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న డ్రైనేజి సమస్యను సోమవారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.20 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ పైపు లైన్ పనులు చేపట్టామని తెలిపారు. పనులు జరిగేటప్పుడు స్థానికులు కొన్ని సమస్యలు ఎదుర్కొన్నారని వారితో చర్చించి ఎవరికీ ఎటువంటి సమస్య లేకుండా పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపడతామని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు.

తుది దశలో ఎస్‌టీపీ రెండో గేట్ పనులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ రెండో గేటు పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్లాంట్‌లోకి వచ్చి వెళ్లేందుకు ఒకే మార్గం ఉండటంతో టిప్పర్లు, చెత్త సేకరణ ఆటోరిక్షాలు ఒకేసారి వచ్చినపుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై ఆటో రిక్షావారు రాంకీ కూకట్‌పల్లి జోన్ హెడ్ రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా రాంకీ సంస్థ రెండో గేటు పనులను ప్రారంభించింది. సుమారు రూ.11 లక్షలతో చేపడుతున్న రెండో ఎగ్జిట్ పనులు వారం రోజుల్లో పూర్తవుతాయని ఆయన 'సాక్షి' కి తెలిపారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారం కానుంది. జలమండలి ఆధ్వర్యంలో సోమవారం పైపులైన్ వేసేందుకు రోడ్డు తవ్వకాలు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'పది'లో వంద శాతం లక్ష్యంగా..



బాలానగర్‌లోని జెడ్‌పిహెచ్‌యస్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు

బాలానగర్: పదవ తరగతి పరీక్షల టైం టేబుల్ వచ్చేసింది.దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం టెన్త్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. బాలానగర్‌లో జెడ్పీహెచ్ఎం పాఠశాల ఉపాధ్యాయులు వారికి అండగా నిలుస్తున్నారు. పదవ తరగతిలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో ఇంగ్లీషు మీడియం విద్యార్థులు 44 మంది కాగా, 21 మంది తెలుగు మీడియం. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఒక సబ్జెక్టును తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. క్లాసులో చెప్పిన పాఠాలు అర్థం కాని విద్యార్థులకు మళ్లీ బోధిస్తున్నారు. ఈ విధంగా వారి సందేహాలను నివృత్తి చేస్తూవారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతున్నారు. గత సంవత్సరం సాధించిన ఫలితాల కంటే మెరుగైన ఫలితాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఉత్తమ ఫలితాలు కోసం..



కొత్తగా ఆరు పేపర్లతో కూడిన పరీక్షలపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. అదే విధంగా వంద శాతం సిలబస్ గురించి చెబుతున్నాం. పదవతరగతిలో మా పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నాను.
–శ్రీరాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, బాలానగర్

దాతల కోసం ఎదురుచూపు..

ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం వరకు పాఠశాలలోనే గడుపుతున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే దాతలు ఎవరైనా దొరికితే మరో గంట సేపు పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉన్నారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు అల్పాహారం అందిస్తే వారి విద్యకు చేయూతను ఇచ్చినట్లే.

జేఎన్‌టీయుహెచ్‌లో వర్క్‌షాప్



జేఎన్‌టీయుహెచ్‌లో జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ కట్టా నరసింహారెడ్డి, ఐఐటి గౌహతి ప్రొఫెసర్ జాన్ జోస్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయుహెచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సైబర్ సెక్యూరిటీ, ఐఐటీ గౌహతి, సిడాక్ సంస్థలు సంయుక్తంగా ఐఓటి ఎకో సిస్టమ్స్ సెక్యూరిటీ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఐటీ గౌహతి ప్రొఫెసర్ జాన్ జోస్, విద్యార్థులు, జేఎన్‌టీయూహెచ్ అనుబంధ కళాశాల అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతూ ఎంబెడెడ్ ఐఓటీ సెక్యూరిటీ విభాగంలో అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలు, ఆ రంగంలో అందుకోదగిన అవకాశాల గురించి వివరించారు. ప్రొఫెసర్ సుకుమార్ నంది మాట్లాడుతూ ఐఓటీ సెక్యూరిటి విభాగంలో వున్న సమస్యలను, పరిశోధనాంశాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఐఓటీ రంగం అనేక ఎలక్ట్రానిక్ పరికరాల సృష్టికి కారణమవుతుందని, కానీ వాటి వినియోగంలో తగిన జాగ్రతలు పాటించకపోతే సెక్యూరిటీ సమస్యలు తలెత్తే అవకాశం వుందని తెలిపారు. రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఐఓటీ మన దైనందిన జీవితంలో భాగమైపోయిందని, ఈ విభాగంలో పరిశోధనకు చాలా అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ వర్ధమాన సాంకేతిక అంశాలపై విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహనకోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సిడాక్ డైరెక్టర్ లక్ష్మి ఈశ్వరి, సిడాక్ సీనియర్ డైరెక్టర్ సి.హెచ్.ఎ.ఎస్. మూర్తి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీదేవి, ఎం. రామచంద్రరావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో భారత వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్, వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బీవీపీ సత్సంగ్ హాలులో వివేకానంద 160 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్య బ్రహ్మ శంకరనారాయణ రచించిన రామశతకం ఆవిష్కరణ, భువన విజయం సాహిత్య రూపకం కావ్యావిష్కరణ జరిగింది. తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి ముఖ్య అతిథిగా, మాజీ శాసనమండలి సభ్యుడు ఎం. రామచంద్రరావు ఆవిష్కర్తగా, అశ్విని సుబ్బారావు అధ్యక్షులుగా,మావుడూరి సూర్యనారాయణ మూర్తి సమీక్షకులుగా, మారుమాముల దత్తాత్రేయ శర్మ అంకిత స్వీకర్తగా,సాధన నరసింహాచార్యసమన్వయకర్తగా వ్యవహరించారు.

రేపు ముగ్గుల పోటీలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా కమిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు బుధవారం కార్పొరేటర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఫోన్ చేసి మంగళవారం సాయంత్రం లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీలో గెలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9849150107, 8367334030, 8374723476 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న పన్నాల హరీష్ రెడ్డి

బాలానగర్: బర్కత్‌పుర దీన్‌దయాళ్ సెంట్రల్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ భాగ్యనగర్ రైల్వే స్టేషన్ సుందరీకరణ, పలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న రానున్నారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్పనపల్లి సూర్యరావు, కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, అసెంబ్లీ కన్వీనర్‌శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగుల రాజిరెడ్డిలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలి



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో నాలా పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మహేందర్ పరిశీలించారు. నాలా పనుల్లో నాణ్యతలేదని, పనులు నత్తనడకన సాగుతున్నాయని, నాణ్యత లేని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీయాలని ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు సూచించారు. నాణ్యత లేని పనులు చేయవద్దని, పనులను ఆపివేయాలన్నారు. ఇక్కడ పేద ప్రజలు నివసిస్తున్నారని వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు సక్రమమైన పద్ధతుల్లో నాణ్యతా ప్రమాణాలతో చేయాలని అధికారులను ఆదేశించారు. బీజేపీ నాయకులు ఎర్రస్వామి, నాగరాజు, శ్రీకాంత్, స్నేహపురి కాలనీ సభ్యుడు మల్లేష్ యాదవ్, కృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ పాలనకు ప్రజలు వీఆర్‌యస్‌కు ఇచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. సోమవారం బాలానగర్ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న మంచినీటి సమస్య, పొంగిపొర్లుతున్న డ్రైనేజీ, నాలాల ఆక్రమణ వంటి సమస్యలపై ఆయన దృష్టి సారించారు. బస్తీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలానగర్ బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని పేర్కొన్నారు. డివిజన్‌లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఈ నెల 11న జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిత్యం అన్ని బస్తీ, కాలనీల్లో పాదయాత్ర చేస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నానని స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన డివిజన్ పరిధిలోని మహావీర్ కాలనీలో రెండు వీధుల్లో డ్రైనేజీ, రోడ్లు పెండింగ్‌లో ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం ఆ ప్రాంతాల్లో పాదయాత్ర చేసి సమస్యలనుపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి సమస్య వచ్చినా తక్షణం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, నాయకులు అగ్రవాసు, రాములుగౌడ్, వీరేష్, మౌలానా, గోరె మియా, రాగవయ్య, కూర్మయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం తగదు

నిజాంపేట్: ఎస్ఐ, కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోందని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. విద్యార్థి సంఘాల ఏజేసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ప్రగతిభవన్ ముట్టడిలో భాగంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్‌ను ఆదివారం రాత్రి బాచుపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం అతడిని పరామర్శించిన శ్రీనివాస్, ఏఐటీయుసీ నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు మార్చడంతో యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

నిజాంపేట్: తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో మల్కాజ్‌గిరి టీడీపీ అధ్యక్షుడు శివరాజ్, ఎంపీటీసీ సత్తన్న లతో కలిసి టీటీడీపీ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్, మురళి, రాకేష్, శివకుమార్, రామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎన్‌సీఎల్ సింధులో ఈ నెల 11న తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎన్‌సీఎల్ సింధు క్లబ్ హౌజ్‌లో జరిగే ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు కోరారు.




ఇబ్రహీమ్ చెరువును శుభ్రం చేస్తున్న వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల విద్యార్థులు

చెరువు ప్రక్షాళన

నిజాంపేట్: బాచుపల్లికి వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్‌వీజేఐఈటీ) కళాశాల బిటెక్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నేక్‌నామ్‌పూర్‌లోని ఇబ్రహీమ్ చెరువును శుభ్రం చేశారు. 120 మంది విద్యార్థులు పాల్గొనగా అధ్యాపకులు డాక్టర్ మాధవి, డాక్టర్ మన్మధ్‌నాథ్ దాస్, డాక్టర్ సునంద, డాక్టర్ నేహా, డాక్టర్ విజయరాఘవన్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ అశోక్ భోగి 'ధ్రువాంశ్' సంస్థ సహకారంతో ఈ చెరువు శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. చారిత్రక చెరువును పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని, కొన్నేళ్ల క్రితం కాలుష్యానికి మారుపేరుగా నిలిచిన ఇబ్రహీమ్ చెరువును, పరిసరాలను లాభాపేక్ష లేకుండా 'ధ్రువాంశ్' ద్వారా పునరుద్ధరించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులతో చెరువు పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేపట్టినట్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ అశోక్ భోగి తెలిపారు.

సంఘటిత ఉద్యమంతోనే హక్కుల సాధన



సమావేశమైన భవన నిర్మాణ కార్మికులు

జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ కార్మికులు హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలని ఏఐటీయుసీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట నల్లమల గిరిప్రసాద్ విజ్ఞాన కేంద్రం భవనంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం సాధారణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన హరినాథ్, సాయిలు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. వారు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని, ప్రతి అమావాస్యకు పనులు నిలిపివేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇఎస్ఐ, పీఎఫ్ పథకాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సామేల్, రాము, మసలయ్య, ఆరీఫ్, బాలాజీ, యూసూఫ్, రాములు, ఆరోగ్యం, యాదగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న బాబూ మోహన్, కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్‌కు చెందిన ఏలూరి సుబ్బారావు 12 వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు బీజేపీ సీనియర్ నాయకులు, ఆందోల్ మాజీ శాసన సభ్యుడు బాబూ మోహన్, స్థానిక కార్పొరేటర్ మహేందర్‌లు టిఫిన్ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా బాబూమోహన్ మాట్లాడుతూ సుబ్బారావు ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడుస్తూ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద కోటి 90 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న కల్వర్టు పనులను, దీనబంధు కాలనీ బ్రిడ్జి దగ్గర నుంచి జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ విగ్రహం వరకు సీసీ రోడ్డు పనులను సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజాదేవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఈ సమస్య ఉందని నేటితో ఈ సమస్య తీరిపోనుందన్నారు. వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరంనగర్ కాలనీ హైటెన్షన్ లైన్ కింద నాలా మీద కల్వర్టు నిర్మాణ పనులతో ఇక్కడి ప్రాంత ప్రజలకు, కాలనీ వాసులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. దీంతో ప్రయాణ దూరం తగ్గి, సమయం,ఇంధనం ఆదా అవుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌యస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, మాచర్ల భద్రయ్య, భగవాన్ పాల్గొన్నారు.

సున్నం చెరువు నాలా పనుల పరిశీలన



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సర్వే నెంబర్18ల నిర్మిస్తున్న సున్నం చెరువు నాలా పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సున్నం చెరువు నుండి సర్వే నెంబర్ 18 వరకు నిర్మిస్తున్న నాలాను రూ.5 కోట్లతో నిర్మిస్తున్నామని, త్వరలో ఈ నాలా పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు వచ్చే డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు వర్షాకాలంలో వచ్చే వరదల నుంచి కూడా విముక్తి కలుగుతుందని తెలిపారు. ఈ నాలా నిర్మాణం వల్ల పద్మావతి నగర్, జ్యోతినగర్, అజీజ్‌నగర్ వాసులకు డ్రైనేజీ, వర్షపు నీటి ముంపు నుండి శాశ్వత పరిష్కారం కలుగుతుందన్నారు. జావిద్, జ్ఞానేశ్వర్, ఇస్మాయిల్, సయ్యద్ జాఫర్, యోగి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో పేదలైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించటంతో పాటు, అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలో ప్రకాశం నగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.15.20 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి పెద్ద చెరువును కాపాడాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి పెద్ద చెరువును కాపాడాలని, ప్రాపర్టీ టాక్స్‌ను తగ్గించాలని కోరుతూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ బాచుపల్లి సర్వే నెంబరు 64లోని పెద్ద చెరువు శిఖం భూమిని ఏపీఆర్ ప్రాజెక్ట్ యాజమన్యం కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతోందని, దీనిపై విచారణ చేపట్టి చెరువు స్థలాన్ని పరిరక్షించాలన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లో ఆస్తి పన్ను విధింపులో వ్యత్యాసాలను తొలగిస్తూ ఇళ్లకు 18 శాతం, కమర్షియల్‌కు 36 శాతం విధించారని, అదే సమయంలో జీహెచ్ఎంసీ పరిధిలో 15 శాతం, 30 శాతాలుగా ఉందన్నారు. అధిక ఆస్తి పన్నులు విధించడంతో ప్రజలపై భారం పడుతోందని, ఆస్తి పన్నును తగ్గించేలా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, సీనియర్ నాయకుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.